www.udyamakeratam.com

PRGI : TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 40 | 17-7-2026 | శుక్రవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## 5 లక్షలకు 111 ప్రశ్నల విక్రయం



- నీట్ పేపర్ లీక్‌లో సంచలన అంశాలు
- సీబీఐ దర్యాప్తులో కీలక ఆధారాలు.. కోర్టుకు నివేదిక
- కోచింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫోన్‌లో లీకైన ప్రశ్నల ఆనవాళ్లు
- పరీక్షకు 10 రోజుల ముందే ప్రశ్నలు చేరినట్లు సీబీఐ వెల్లడి

4



## పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోదీ

4

## పార్లమెంట్ సమావేశాలకు కొత్త నిబంధనలు



- జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు
- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం మార్గదర్శకాలు జారీ

4



# సీతారామ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేస్తాం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనుల క్షేత్రస్థాయి పరిశీలన

- గోదావరి జలాల మళ్లింపుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వెల్లడి
- రీ-డిజైనింగ్ పేరుతో గత కేసీఆర్ ప్రభుత్వం 24,000 కోట్లకు అంచనాలు పెంచిందని ధ్వజం
- కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోయాయన్న మంత్రి ఉత్తమ్
- ప్రజాధనం వృథా కాకుండా యుద్ధప్రతిపాదికన పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ నిశ్చయం

2

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గురువారం అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం గోదావరి తీరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. గోదావరి జలాలను మళ్లించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇటీవల దేవాదుల ప్రాజెక్టును పరిశీలించినట్లు గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించామని చెప్పారు. గోదావరిపై నిర్మితమవుతున్న చివరి ప్రధాన ప్రాజెక్టుగా సీతారామకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు.

*- భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16(ఉద్యమ కెరటం)*

# గోల్కొండలో బోనాల వైభవం

## తొలి బోనంతో ఆషాఢ మహోత్సవాలకు శ్రీకారం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు సురేఖ, పొన్నం



- డప్పుల చప్పుళ్లు.. పోతురాజుల విన్యాసాలు..
- శివసత్తుల పూనకాలతో కోటలో భక్తి వెల్లువ
- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల
- ప్రజలకు రేవంత్‌రెడ్డి బోనాల శుభాకాంక్షలు

2

తెలంగాణ సంస్కృతి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సాంప్రదాయ డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ కోట పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విరాసిల్లాయి. ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా--బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర ప్రజాప్రతినిధులు ఆలయానికి చేరుకొని, సాంప్రదాయబద్ధంగా తొలి బోనం ఎత్తుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

*- హైదరాబాద్, జూలై 16 (ఉద్యమ కెరటం):*

# నేడు తెలంగాణ కేబినెట్ కీలక భేటీ

సాగునీటి ప్రాజెక్టులు.. కొత్త మున్సిపల్ చట్టంపై నిర్ణయాలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం
- ప్రాజెక్టుల రీ-ఎస్టిమేషన్లు, అసెంబ్లీ బిల్లులపై చర్చ
- అభివృద్ధి, సంక్షేమ అంశాలపై కీలక నిర్ణయాలకు అవకాశం

2



## తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి

మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్

3





## సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

- రెండో తరగతి విద్యార్థికి మతపైరమన హోం వర్క్
- టీచర్‌ను నిలదీత..పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

2

## కరెంట్ కోతలతో అవస్థలు

- కాంగ్రెస్ తీరువల్ల విద్యుత్ కేంద్రాల్లో పడిపోయిన ఉత్పత్తి
- నీటిని ఎత్తిపోయలేదు.. రిజర్వాయర్లు నింపలేదు
- ఇతర రాష్ట్రాలకు నాణ్యమైన బొగ్గు సరఫరా
- తెలంగాణకు తక్కువ రకం బొగ్గు ఎందుకిస్తున్నారు?
- పంట బోనస్‌ను పెద్ద బోగస్ చేశారు
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్‌రావు

2



రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ ముందుచూపు లేమే కారణమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.



3

## అన్నివర్గాలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

సంక్షేమాన్ని విస్మరించి, స్కామ్‌ల్లో మునిగిన కాంగ్రెస్

హైదరాబాద్ బీఆర్ఎస్ నాయకుల సమీక్షలో కేటీఆర్

## ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం

రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు

2



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం 17 జూలై 2026



# నేడు తెలంగాణ కేబినెట్ కీలక భేటీ

**సాగునీటి ప్రాజెక్టులు.. కొత్త మున్సిపల్ చట్టంపై నిర్ణయాలు**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం**

**ప్రాజెక్టుల రీ-ఎస్టిమేషన్లు, అసెంబ్లీ బిల్లులపై చర్చ**

**అభివృద్ధి, సంక్షేమ అంశాలపై కీలక నిర్ణయాలకు అవకాశం**


**హైదరాబాద్, జులై 16 (ఉద్యమ కెరటం) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం రేపు, జులై 17న జరగనుంది. ఈ అత్యవసర సమావేశంలో పలు కీలక సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపు, రాబోయే అసెంబ్లీ బిల్లులు, నూతన మున్సిపల్ చట్టం ముసాయిదాపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి ముహూర్తం ఖరారైంది. రేపు, 17వ తేదీన సచివాలయంలో కేబినెట్ అత్యవసర సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్రంలోని పలు కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. దీంతోపాటు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బిల్లులపై కూడా కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులపై ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాజెక్టుల రీ-ఎస్టిమేషన్స్ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. పాలనా సంస్కరణల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేయబోతోంది. రాబోయే అసెంబ్లీ సభలో సరికొత్త 'మున్సిపల్ చట్టాన్ని' ప్రవేశపెట్టేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ నూతన మున్సిపల్ చట్టం ముసాయిదాపై కేబినెట్‌లో విస్తృతంగా చర్చించి, దీనికి మంత్రివర్గ ఆమోద ముద్ర వేసే ఛాన్స్ ఉంది. ఈ కీలక మార్పులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

# సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

**రెండో తరగతి విద్యార్థికి మతపైరమన హోం వర్క్**

**టీచర్‌ను నిలదీత..పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు**

**ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్, జులై 16 (ఉద్యమ కెరటం) :** హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 'కల్మా', 'సూరహ్ ఫాతిహా' రాసి, పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను విధుల నుంచి తొలగించింది. అలాగే భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల్లో ఆమెకు ఉద్యోగావకాశం కల్పించబోమని తెలిపింది. ఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో పాఠశాల వద్ద బీజేపీ నాయకులు నిరసన చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకు మతపరమైన అంశాలను నేర్చుకోవాలని చెప్పడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయగా, 'మా స్కూల్‌లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందే' అని సదరు టీచర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, ఈ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోమ్‌వర్క్ ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. కల్మా చదవాలని విద్యార్థికి హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ సెక్యులర్ సంఘాలు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గోల్కొండలో బోనాల వైభవం

**తొలి బోనంతో ఆషాఢ మహోత్సవాలకు శ్రీకారం**

- దప్పుల చప్పుళ్లు.. పోతురాజుల విన్యాసాలు..
- శివసత్తుల పూనకాలతో కోటలో భక్తి వెల్లువ
- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల
- ప్రజలకు రేవంత్‌రెడ్డి బోనాల శుభాకాంక్షలు



**హైదరాబాద్, జూలై 16 (ఉద్యమ కెరటం):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు గురువారం గోల్కొండ శ్రీ జగదంబ మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. దప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకోవడంతో గోల్కొండ కోట భక్తి పారవశ్యంతో మార్మోగింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సుమారు మూడు వేలకుపైగా దేవాలయాల్లో బోనాల ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. తొలి బోనం అనంతరం నగరంలోని వివిధ మహంకాళి ఆలయాల్లో బోనాల వేడుకలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా గోల్కొండ శ్రీ జగదంబ మహంకాళి అమ్మవారిని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించి రాష్ట్ర ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం కుమ్మర సమాజానికి చెందిన మహిళలు గోల్కొండ జగదంబ మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తారని తెలిపారు. అక్కడి నుంచి లష్కర్ బోనాలతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రతి గల్లీ, ప్రతి ఇంటికి ఈ వేడుకలు విస్తరిస్తాయని, అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోనూ బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారని చెప్పారు. అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రజలు సుఖశాంతులు, సకాలంలో వర్షాలు, పాడిపంటల సమృద్ధి, రాష్ట్ర సుభిక్షత కోసం మొక్కులు చెల్లిస్తారని ఈటల పేర్కొన్నారు. బోనాల పండుగ భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అందించే మహత్తర ఉత్సవమని అన్నారు. ఇదిలా ఉండగా, బోనాల మహోత్సవాల ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ, ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆలయాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు వెల్లడించింది.

# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- గోదావరి జలాల మళ్లింపుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వెల్లడి



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16(ఉద్యమ కెరటం):** గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

**అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం**

**రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు**

**న్యూఢిల్లీ, జూలై 16 (ఉద్యమ కెరటం):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు భారీ ఎత్తున రాజీనామాలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు అంతరిక్ష విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ కీలక నిర్ణయం తీసుకుంది. శాస్త్రవేత్తలకు రాజీనామాల నిబంధనలను కఠినతరం చేసింది. ఈ ఆదేశాలను అంతరిక్ష విభాగం గురువారం జారీ చేసింది. వాటిని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పలు కేంద్రాలకు కూడా పంపింది. భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్‌తోపాటు ఇతర 'ముఖ్యమైన మిషన్ల'కు అనుబంధంగా పని చేస్తున్న గ్రూప్- ఏ శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది నుంచి వచ్చే రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు యథావిధిగా అంగీకరించ వద్దని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగుల రాజీనామాతో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. శాస్త్రవేత్త, ఇంజనీర్ హోదా లేదా అంతకంటే తక్కువ స్థాయిలోని సాంకేతిక సిబ్బంది నుంచి స్వీకరించిన రాజీనామాలను తమకు పంపాలని సదరు కేంద్రాలకు అంతరిక్ష విభాగం స్పష్టం చేసింది. అదికూడా ఆయా కేంద్రాల్లోని డైరెక్టర్ల స్పష్టమైన సిఫార్సులతో పంపాలని కోరింది. అయితే గ్రూప్- ఏ స్థాయిలోని ఉద్యోగుల రాజీనామాలను ఆమోదించేందుకు ఈ కేంద్రాల డైరెక్టర్లకు గతంలో ఇచ్చిన ఆదేశాలను తాజాగా అంతరిక్ష విభాగం రద్దు చేసింది. ఇటీవల ఇస్రో నుంచి 100 మందికి పైగా సిబ్బంది రాజీనామా చేశారంటూ వార్తా కథనాలు వెలువడ్డాయి. అందులో బెంగళూరులోని యూఆర్ఎస్‌సి, తిరువనంతపురంలోని వీఎస్ఎస్‌సి నుంచి పెద్ద ఎత్తున శాస్త్రవేత్తలు రాజీనామాలు చేశారు. ఆ జాబితాలో ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఈ రాజీనామాలు చేసిన శాస్త్రవేత్తలు అంతా.. స్పేస్ స్టార్టప్‌లలో చేరుతున్నట్లు సమాచారం. 2020లో అంతరిక్ష రంగంలోకి ప్రవేశించేందుకు ప్రైవేట్ సంస్థలను కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. 2023లో భారత అంతరిక్ష విధానాన్ని ప్రారంభించింది. నాటి నుంచి స్పేస్ స్టార్టప్‌లు దూసుకు వెళ్తున్నాయి. దేశంలో ప్రస్తుతం 400కు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయి. అవి 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2025లో వాటికి 150 మిలియన్ డాలర్లు సమకూరాయి. పిక్సెల్, ధ్రువ స్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఈ పోటీలో ముందున్నాయి.



# అన్నివర్గాలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- సంక్షేమాన్ని విస్మరించి, స్కామ్‌ల్లో మునిగిన కాంగ్రెస్
- హైదరాబాద్ బీఆర్ఎస్ నాయకుల సమీక్షలో కేటీఆర్



**హైదరాబాద్, జూలై 16 (ఉద్యమ కెరటం):** కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, కేవలం సగం పదవీకాలం పూర్తికాకముందే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిన మోసకారి ప్రభుత్వంగా కాంగ్రెస్ మారిందని, అందుకే సమాజంలోని ప్రతి వర్గం ఆ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన విమర్శించారు. ఈరోజు పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ స్థానిక ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారాయని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కాలం ముగిసిపోతుందనే విషయం స్పష్టమవుతున్న నేపథ్యంలోనే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతూ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని అన్నారు. రైతులు సాగునీటి కోసం అడుగుతుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి "రక్తం పారిస్తా" అన్నట్లుగా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. ఒకవైపు రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో, కరువు అంచున ఉండగా, ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలందరిలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయని పేర్కొన్నారు. చివరకు రైతులు కూడా "మా రక్తాన్ని తీసుకోండి... కానీ మా పొలాలకు నీళ్లు ఇవ్వండి" అని డిమాండ్ చేసే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. యువత, నిరుద్యోగుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరిట భారీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎప్పటికప్పుడు ఆ మోసాన్ని ఎండగడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్లలోని హామీల అమలు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తోందని తెలిపారు. వరంగల్ రైతు సభ అనంతరం, ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ఈ సదస్సు ఏర్పాట్లపై నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, అలాంటి ప్రయత్నాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు.

# అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు

- కాంగ్రెస్ తీరువల్ల విద్యుత్ కేంద్రాల్లో పడిపోయిన ఉత్పత్తి
- నీటిని ఎత్తిపోయలేదు.. రిజర్వాయర్లు నింపలేదు
- ఇతర రాష్ట్రాలకు నాణ్యమైన బొగ్గు సరఫరా
- తెలంగాణకు తక్కువ రకం బొగ్గు ఎందుకిస్తున్నారు?
- పంట బోనస్‌ను పెద్ద బోగస్ చేశారు
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్‌రావు



**హైదరాబాద్, జూలై 16 (ఉద్యమ కెరటం):** రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక, కనీస సోయి లేకపోవడం వల్లే తెలంగాణ మళ్లీ అంధకారంలోకి వెళ్లే పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తే.. నేడు 11 జిల్లాల్లో కరెంట్ కోతలకు నిరసనగా సబ్‌స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కేవలం 15 వేల మెగావాట్ల లోడ్ మాత్రమే ఉన్నప్పటికీ, 7,180 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యమున్న ప్లాంట్లలో నిన్న కేవలం 3,190 మెగావాట్లు (44 శాతం) మాత్రమే ఉత్పత్తి జరిగిందని హరీష్‌రావు గణాంకాలతో సహా వివరించారు. కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లలో వారం రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవని, యాదాద్రిలో బొగ్గు లేక, భద్రాద్రిలో నిర్వహణ లోపంతో ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. సింగరేణి వెబ్‌సైట్‌ను మూసివేసి అక్రమాలను దాస్తున్నారని మండిపడ్డారు. నాణ్యమైన సింగరేణి బొగ్గును ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తూ.. తెలంగాణ ప్లాంట్లకు లో-క్వాలిటీ బొగ్గు ఇస్తున్నారని, అందుకే 70 రేకులు పంపితే 30 రేకులు రిజెక్ట్ అవుతున్నాయని ఆరోపించారు. మన దగ్గర బొగ్గు ఉండి కూడా పవర్ ఎక్స్ఛేంజ్‌లో అడ్డగోలు ధరలకు 80 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొంటూ ఆ భారాన్ని ప్రజలపై వేస్తున్నారని, ఈ విద్యుత్ కొనుగోళ్ల వెనుక పెద్ద స్కాం దాగి ఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేసిందని హరీష్‌రావు విమర్శించారు. సగం మందికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని, రైతు భరోసాను సీజన్ల వారీగా ఎగ్గొట్టారని, చివరకు పంట బోనస్‌ను కూడా పెద్ద బోగస్‌గా మార్చారని దుయ్యబట్టారు. లోవోల్టేజ్, మోటార్లు కాలిపోవడం వల్ల రైతులు రాత్రంతా పొలాల వద్ద జాగారం చేయాల్సి వస్తోందని, ఇందిరమ్మ పాలన అంటే ఉమ్మడి రాష్ట్రం నాటి కరెంట్ కష్టాలను మళ్లీ తేవడమేనా అని ప్రశ్నించారు. గ్రీన్ ఎనర్జీ పాలసీ కింద 3 వేల మంది పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్నా.. కమిషన్ల కక్కుర్తి కోసమే ఫైళ్లను క్లియర్ చేయడం లేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు నేడు ప్రారంభించిన సీతారామ ప్రాజెక్ట్ మోటార్లు కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసినవేనని, కేసీఆర్ పెట్టిన మోటార్లకు కాంగ్రెస్ మంత్రులు కేవలం స్విచ్‌లు వేయడానికి మాత్రమే వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. వెంటనే థర్మల్ ఉత్పత్తిని పెంచి, రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హరీష్‌రావు హెచ్చరించారు.

# తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి



## సమీక్షల కోసం కమిటీ సభ్యులే జిల్లాలకు రావాలి

## మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్

**హైదరాబాద్,జూలై 16 :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ గురువారం అమరవీరుల స్మారక చిహ్నంలో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. సింగరేణి బొగ్గు గనుల సమ్మెల ద్వారా నాటి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మంచిర్యాల, ఆసిఫాబాద్ కార్మిక శ్రేణులు, ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన కరీంనగర్ పోరాట గడ్డల త్యాగాలు చారిత్రాత్మకమైనవని ప్యానల్ స్పష్టం చేసింది. ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అత్యధిక శాతం మంది ఉద్యమకారులు సంక్షేమ పథకాల కంటే ముందే రెండు అత్యంత కీలకమైన డిమాండ్లను కమిటీ ముందు గట్టిగా లేవనెత్తారు. సుదూర ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి సరిహద్దు జిల్లాల నుండి వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ దాకా రాలేకపోతున్నారని ప్రతినిధులు కమిటీ దృష్టికి తెచ్చారు. అందువల్ల, కమిటీ సభ్యులే స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో ఉండి నిజమైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని పట్టుబట్టారు. రెండు ప్రధాన డిమాండ్లతో పాటు, క్షేత్రస్థాయి యోధులు తమ ఇతర ఆత్మగౌరవ సంక్షేమ వినతులను కూడా కమిటీకి సమర్పించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలని,జీవన భృతి కోసం గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించాలని,ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వీటితో పాటు మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఉచిత నాణ్యమైన విద్య, మరియు ఆర్టీసీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి పత్రాలు సమర్పించారు. ఉద్యమకారులు లేవనెత్తిన అంశాలపై కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు స్పందిస్తూ.. 'మీ ప్రతిపాదనలు వందకు వంద శాతం న్యాయమైనవి. ఈ అంశాలను సమగ్ర నివేదికలో చేర్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తక్షణమే తీసుకెళ్తామని అన్నారు. ప్రతి ఒక్క నిజమైన పోరాట యోధునికి న్యాయం జరిగేలా చూస్తాం' అని గట్టి భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు.



# ఎడ్యుకేషన్ జిహాద్‌పై బీజేపీ ఆగ్రహం

## సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

## బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్

**హైదరాబాద్, జూలై 16(ఉద్యమ కెరటం):** 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.

# డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదు

## మహిళా బిల్లుతో వారి సాధికారితకు అవకాశం

## బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం



**న్యూఢిల్లీ, జూలై16(ఉద్యమ కెరటం):** డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ప్రస్తుత సీట్లు తగ్గకుండా 50 శాతం వరకు పెంపునకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. వికసిత భారత్ - 2047 లక్ష్యంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగ నున్నాయని లక్ష్మణ్ వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంస్కరణల ఎజెండాపై సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. ఇది అభివృద్ధి పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా నుంచి ఆత్మనిర్భర్ భారత్ వరకు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో వారి సాధికారతకు ఊతం అవుతుందని బీజేపీ ఎంపీ చెప్పారు. మహిళాబిల్లుతోపాటు డీలిమిటేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక దేశ ప్రయోజనాల కోసమేనని తెలిపారు. అవినీతి నిరోధక చట్టాలకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. జేపీసీ నివేదిక తర్వాత కీలక బిల్లులపై ముందడుగు పడుతుందని ఎంపీ లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, యువత అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్లమెంట్‌లో స్వరం వినిపిస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు ఇచ్చిందని ఆయన వివరించారు. వర్షాకాల సమావేశాల్లో సభను అడ్డుకోవద్దని.. చర్చల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలే అందరికీ అత్యున్నత ప్రాధాన్యత కావాలని తెలిపారు. వర్షాకాల సమావేశాలు దేశాభివృద్ధికి కొత్త దిశానిర్దేశర చేస్తాయని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అన్ని అంశాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ వివరించారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
17 జూలై 2026



# డీలిమిటేషన్ చుట్టూ రాజకీయ చదరంగం!

**పార్లమెంట్ సమావేశాల వేళ వేగం పెంచిన ఎన్డీఏ వ్యూహాలు**

**రెండింట మూడొంతుల మెజారిటీపై బీజేపీ దృష్టి**

మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఏ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్దం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శతృవులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మ-రోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణవ-మూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది..ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది.దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

# రూ.5 లక్షలకు 111 ప్రశ్నల విక్రయం

- నీట్ పేపర్ లీక్‌లో సంచలన అంశాలు
- సీబీఐ దర్యాప్తులో కీలక ఆధారాలు.. కోర్టుకు నివేదిక
- కోచింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫోన్‌లో లీకైన ప్రశ్నల ఆనవాళ్లు
- పరీక్షకు 10 రోజుల ముందే ప్రశ్నలు చేరినట్లు సీబీఐ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 16 (ఉద్యమ కెరటం):** నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సీబీఐ దర్యాప్తు మరిన్ని కీలక విషయాలను వెలుగులోకి తెచ్చింది. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రానికి చెందిన 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించినట్లు సీబీఐ ఢిల్లీ ప్రత్యేక కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. కేసులో నిందితుడైన మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా పనిచేసిన పీవీ కులకర్ణి ద్వారా శివరాజ్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపింది. శివరాజ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా 36 ఫొటోలు లభించాయని, వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉన్నాయని సీబీఐ వెల్లడించింది. వీటిలో 111 ప్రశ్నలు నీట్-యూజీ 2026 మాస్టర్ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు తెలిపింది. ఆ ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ కూడా నిందితుడివేనని భావిస్తున్నట్లు కోర్టుకు వివరించింది. పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు, అంటే ఏప్రిల్ 23 ప్రాంతంలోనే ఈ ప్రశ్నలు నిందితుడి వద్దకు చేరినట్లు దర్యాప్తులో తేలిందని సీబీఐ పేర్కొంది. ఇందుకోసం రూ.5 లక్షలు చెల్లించినట్లు ఆరోపించింది. అంతేకాకుండా లీకైన ప్రశ్నపత్రం పీడీఎఫ్ కాపీలను టెలిగ్రామ్ ద్వారా రూ.10 లక్షలకు విక్రయించినట్లు కూడా దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపింది. పరీక్షకు కొన్ని వారాల ముందే 410 ప్రశ్నలతో కూడిన 150 పేజీల అంచనా ప్రశ్నపత్రాన్ని కొంతమంది అభ్యర్థులకు అందించగా, అందులోని సుమారు 120 ప్రశ్నలు అసలు నీట్ రసాయన శాస్త్ర ప్రశ్నపత్రంతో సరిపోలినట్లు వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ తెలిపింది. వారంతా ప్రస్తుతం న్యాయస్థాన కస్టడీలో ఉన్నారని పేర్కొంది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేయగా, అనంతరం జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ప్రశ్నపత్రం లీక్ నెట్‌వర్క్, ఇతర ప్రమేయంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన



- అతడిని కాపాడాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 16(ఉద్యమ కెరటం):** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అతడి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆదేశించింది. రెండు వారాలకుపైగా దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో దిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుంది. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో ఎటువంటి వైద్య చికిత్సలైనా అందించాలని గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. ప్రతిపౌరుడి ప్రాణం అమూల్యమైంది. అలాంటి ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాలు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. మరో 48 గంటలు ఈ నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే 59 ఏళ్ల వాంగ్‌చుక్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లొచ్చంటూ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాంగ్‌చుక్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన పిటిషనర్.. ఆయనకు బలవంతంగా ఆహారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. తాజా ఆదేశాలు జారీ చేసింది. 19 రోజులుగా వాంగ్‌చుక్ దీక్ష చేస్తున్నారు. ఇన్ని రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన 9 కేజీల వరకు బరువు తగ్గారని వైద్యనిపుణులు చెప్తున్నారు. తాజాగా తన మద్దతుదారులను ఉద్దేశించి ఆయన ఒక వీడియో విడుదల చేశారు. నా ఆరోగ్యం క్షీణించిన మాట వాస్తవమే. కానీ అత్యంత ప్రమాదకర స్థితికేం దిగజారలేదు. నిరాహార దీక్ష విరమించాలని నన్ను అడగడానికి బదులు జులై 20న 'చలో సంసద్' పేరిట పార్లమెంట్ వరకు నిర్వహించే శాంతియుత మార్చ్‌లో భాగం కావాలని మద్దతుదారులను ఆయన కోరారు.

# పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

**నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, జూలై 16:** దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్-సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రబ్రా, లాత్, మోహానా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

# 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీం అభ్యంతరం

**బోర్డు పరీక్షలకు పునాది వేసే సమయంలో ఒత్తిడి తగదని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ, జూలై 16:** 9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొంది. ఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి. కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.

# పార్లమెంట్ సమావేశాలకు కొత్త నిబంధనలు

- జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు
- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం మార్గదర్శకాలు జారీ

**న్యూఢిల్లీ, జూలై 16 (ఉద్యమ కెరటం):** ఈ నెల 20 నుంచి ప్రారంభమై ఆగస్టు 17 వరకు కొనసాగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పార్లమెంట్‌లో భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు సభ్యుల వ్యక్తిగత గోప్యతను కాపాడే లక్ష్యంతో ఈ నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ నిఘా పరికరాలను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించారు. సభా కార్యకలాపాలను అనధికారికంగా చిత్రీకరించడం, వీడియోలు రికార్డు చేయడం లేదా రహస్యంగా సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయం తెలిపింది. డిజిటల్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో పార్లమెంట్‌లోకి ప్రవేశించే ప్రతి సభ్యుడు, అధికారి, సిబ్బంది ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. భద్రతా చర్యలతో పాటు పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు నిర్వహించడంపై కూడా పూర్తి నిషేధం విధించారు. ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం, సభా మర్యాదలకు భంగం కలిగించే చర్యలకు అనుమతి ఉండదని బులిటెన్‌లో పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ ప్రాంగణంలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు, పూజలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సభా గౌరవం, క్రమశిక్షణ, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఎంపీలందరూ కొత్త మార్గదర్శకాలను పాటించాలని లోక్‌సభ సచివాలయం విజ్ఞప్తి చేసింది.



# బ్రిటిష్ పెత్తనానికి తొలి సవాల్.. హైదరాబాద్‌లోనే!

# రెసిడెన్సీపై దండెత్తిన వీరులు

- 1857 జూలై 17న ఆంగ్లేయుల గుండెల్లో గుబులు పుట్టించిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్
- ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హైదరాబాద్ చరిత్రను చిరస్థాయిగా నిలిపిన వీరోచిత పోరాటం
- బ్రిటిష్-నిజాం ఉమ్మడి బలగాలను ఎదురించి ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నేటికీ ఘన నివాళులు

**1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అంటే ఉత్తర భారతదేశంలో జరిగిన తిరుగుబాటే గుర్తుకొస్తుంది. కానీ దక్షిణ భారతదేశంలోనూ అదే స్ఫూర్తితో ఆంగ్లేయులపై ఆయుధాలు ఎత్తిన వీరులు ఉన్నారు. హైదరాబాద్ నగరంలోని బ్రిటిష్ రెసిడెన్సీపై 1857 జూలై 17న జరిగిన చారిత్రాత్మక దాడి ఆ పోరాటానికి నిదర్శనం. ఈ సాహసోపేత యుద్ధానికి మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ నాయకత్వం వహించి స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. 1800లో నిజాం సంస్థానం ఈస్ట్ ఇండియా కంపెనీతో కుదుర్చుకున్న సైనిక సహకార ఒప్పందం తర్వాత ఆంగ్లేయుల ప్రభావం హైదరాబాద్‌లో క్రమంగా పెరిగింది. వారి పెత్తనం, జోక్యంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగి, 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం సమయంలో అది తిరుగుబాటుగా మారింది.**





ఉద్యమ కెరటం దినపత్రిక ప్రత్యేకం

1800 అక్టోబర్ 12న నిజాం సంస్థానం ఈస్ట్ ఇండియా కంపెనీతో "సైనిక సహకార ఒప్పందం" చేసుకుంది. ఈ ఒప్పందం వల్ల నిజాం రాజ్యం కాస్తా "బ్రిటిష్ రక్షిత ప్రాంతం" అయ్యింది. ఆ తరువాత కూడా ఇరు పక్షాల మధ్య కుదిరిన పలు ఒప్పందాల ఫలితంగా ఆంగ్లేయులు నిజాం సంస్థానంలో ఆధిపత్యం, అహంకారం, అంతులేని పెత్తనం ప్రదర్శించసాగారు. అందుకు ఆగ్రహించిన నైజాం ప్రజలు, ప్రముఖులు ఆంగ్లేయుల చర్యల పట్ల వ్యతిరేకత ప్రదర్శించసాగారు. ఈ వ్యతిరేకత 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం సమయానికి శిఖరాగ్రం చేరుకుంది. ఆ పరిణామాల ఫలితంగా 1857 జూలై 17న హైదరాబాదు నగరంలోని ప్రఖ్యాత మక్కా మసీదులో ప్రజలు సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో వ్యక్తమయిన నిర్ణయం మేరకు ఆంగ్లేయుల ఆధిపత్యానికి కేంద్రస్థానం అయినటువంటి " బ్రిటిష్ రెసిడెన్సీ" మీద దాడికి ప్రజలు సిద్ధమయ్యారు. మక్కా మసీదు నుండి అందిన ఆయుధాన్ని తీసుకుని ప్రజా సమూహం బ్రిటిష్ రెసిడెన్సీ దిశగా సాగింది. ఈ విషయం తెలుసుకున్న నిజాం నవాబు కదలి వస్తున్న ప్రజాదండుకు సంబంధించిన సమాచారాన్ని బ్రిటిష్ రెసిడెన్సీ లోని ఆంగ్లేయ అధికారులకు చేరవేశాడు. ఆ మరుక్షణమే అంగ్లేయాధికారులు అప్రమత్తులయ్యారు. ఆధునిక ఆయుధాలు కలిగిన తమ సైనిక పటాలాలను సమయోధులను ఎదుర్కోడానికి సిద్ధం చేసారు. అశ్విక దళాన్ని, ఫిరంగి దళాన్ని మొహిరించారు.

ఆ చారిత్రాత్మక, సాహసోపేత దాడికి మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ లు నాయకత్వం వహించారు. 1857 జూలై 17 సాయంత్రం ఆరంభం అయినటువంటి పోరాటం ఆ రాత్రాంతా సాగి మరుసటి రోజు తెల్లవారుఝామున ముగిసింది. ఈ పోరులో 32 మంది అమరులయ్యారు. పలువురు గాయపడ్డారు. ఆంగ్లేయుల పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్న అల్లావుద్దీన్, తుర్రేబాజ్ ఖాన్ ప్రజలను సమీకరించుకుని ఆంగ్లేయుల మీద తమ పోరాటాన్ని కొనసాగించేందుకు ప్రస్తుత పోరాట స్థలి నుండి తప్పుకున్నారు. ఆ తరువాత ఆ ఇరువురు యోధులను నిర్బంధించేందుకు తీవ్రంగా గాలిస్తున్నారు అంగ్ల - నిజాం సైన్యాలతో సాగిన పోరాటంలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ అమరులయ్యారు. మౌల్వీ అల్లావుద్దీన్ కొంత కాలం తరువాత పట్టుబడ్డారు. ఆయన ఆజన్మాంతర శిక్షకు గురయ్యారు. ఆయన అందండమాను శిక్షా క్షేత్రం పంపబడ్డారు. ఆ అండమాను శిక్షాకేత్రంలో దశాబ్దాలపాటు గడిపిన మౌల్వీ అల్లావుద్దీన్ కన్నుమూశారు. ఆ యోధుల స్మారకంగా 1957లో భారత ప్రభుత్వం హైదరాబాద్ నగరంలోని కోటి సెంటర్ లో ఒక స్మారక స్థూపం కూడా నిర్మించింది. ఆనాడు జూలై 17న బ్రిటిష్ రెసిడెన్సీ మీద జరిగిన దాడిని గుర్తు చేసుకుంటూ, ఆ దాడికి నాయకత్వం చేపట్టిన ఆ ఇరువురు స్వాతంత్ర్య సమరయోధుల స్మరణలో తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కాకుండా ఆంధ్ర రాష్ట్రంలో కూడా జూలై 17న పలు స్మారక కార్యక్రమాలు జరుగుతున్న సందర్భంగా, ఆ యోధుల త్యాగమయ సాహసోపేత పోరాట చరిత్ర క్లుప్తంగా.




## మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్

దక్షిణ భారత దేశంలో బలమైన నైజాం సంస్థానంలో ఆంగ్లేయుల పెత్తనానికి వ్యతిరేకంగా ప్రజలను తిరుగుబాటుకు ప్రత్యక్షంగా ప్రోత్సహించిన ధార్మిక నాయకులు మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్. ఆయన తిరుగుబాటును ప్రోత్సహించటమే కాకుండా స్వయంగా ప్రత్యక్ష పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజధాని, పూర్వపు నైజాం సంస్థాన రాజధాని కేంద్రం హైదరాబాద్ నివాసి. 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభం కాగానే అల్లావుద్గీన్ తిరుగుబాటు కార్యకలాపాలను ముమ్మరం చేశారు. నిజాం నవాబు సంస్థానంలో భాగమైన ఔరంగాబాదులో ఆంగ్లేయుల మీద తిరుగుబాటు రగులుకుంది. ఆ తిరుగుబాటుకు శ్రీకారం పలికి అక్కడ నుండి ఆశ్రయం నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన యోధులను నిజాం ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ యోధులను విడుదల చేయాలన్న ప్రజల, నిజాం నవాబు విజ్ఞప్తిలు పంపారు. ఆ విన్నతులను ఆంగ్లేయులకు సన్నిహితంగా వ్యవహరిస్తున్న నవాబు తిరస్కరించడంతో ఖిన్నులైన ప్రజలు, ప్రముఖులు 1857 జూలై 17న చారిత్రక మక్కా మసీదులో సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో బ్రిటిష్ రాజ్య ప్రతినిధి నివాసం (బ్రిటీష్ రెసిడెన్సీ) వీరీద దాడి చేయాలని నిర్ణయించారు. నిర్ణయం మేరకు జూలై 17 మధ్యాహ్నం నాలుగు గంటల సమయానికి మౌల్వీ అల్లావుద్దీన్, మరో పోరాట యోధులు పఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌ల నాయకత్వంలో సుమారు ఐదు వందల మంది యోధులు రణనినాదం చేస్తూ గుమికూడారు. ఆ సమూహం ప్రస్తుత సుల్తాన్ బజారు నుండి బ్రిటిష్ ఆధిపత్యానికి చిహ్నమైన 'బ్రిటిష్ రెసిడెన్సీ' వీరీద దాడికి ఉపక్రమించింది. ఆంగ్లేయులకు స్నేహహస్తం అందించిన నైజాం నవాబు ఈ దాడి విషయాన్ని ఆఘమేఘాల మీద ఆంగ్లేయాధికారులకు తెలిపారు. ఆంగ్లేయాధికారులు, నిజాం-ఆంగ్ల సైన్యాలు వ్యూహాత్మకంగా వ్యవహరించి, అదనపు బలగాలతో 'బ్రిటిష్ రెసిడెన్సీ' మొహరించాయి. అల్లావుద్దీన్, తుర్రేబాజ్ ఖాన్‌ల నేతృత్వం లోని ప్రజల దాడిని ఎదుర్కొన్నారు. ఆ రాత్రంతా ఇరుపక్షాల మధ్య కాల్పులు సాగాయి. చివరకు శత్రు బలగాలది పైచేయి కావడంతో స్వదేశీ యోధులు, దాడిని విరమించుకుని నిష్క్రమించారు. ఈ సాహసోపేత చర్యతో ఖంగుతిన్న అధికారులు, నిజాం-ఆంగ్ల సైన్యాలు ఆగ్రహించి హైదరాబాద్ నగర ప్రజల మీద విరుచుకుపడ్డాయి. మౌల్వీ అల్లావుద్దీన్‌ను పట్టిచ్చిన వారికి నాలుగు వేల రూపాయల నజరానా ప్రకటించగా మౌల్వీ అల్లావుద్దీన్ అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఒకటిన్నర సంవత్సరం పాటు పీర్ మహమ్మద్ అను సన్నిహితుని వద్ద ఆశ్రయం పొందిన మౌల్వీ స్వంతగడ్డ, స్వజనుల వీరీద ఆంగ్లేయుల పెత్తనానికి చరమగీతం పాడేందుకు సయ్యద్ భిక్కూ, సయ్యద్ లాల్, మహమ్మద్ అలీ లాంటి పోరాట యోధులతో సంప్రదింపులు సాగించారు. చివరకు ఆయనను ఆంగ్ల బలగాలు నిర్బంధించి, ద్వీపాంతరవాస శిక్ష విధించాయి. ఆయనను 1859 జూన్ 28న అండమాన్ దీవులలోని జైలుకు పంపారు. ఆ జైలులో పాతికేళ్ళు దుర్భర నిర్బంధ జీవితం గడిపిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ 1884లో కన్నుమూసారని డాక్టర్ సరోజినీ రేగాని పేర్కొన్నప్పటికి ఆ మహాయోధ 1889 వరకు సజీవులన్న విషయాన్ని పలు అధికారిక దస్త్రాలు వెల్లడిస్తున్నాయి.

## పఠాన్ తుర్రేబాజ్ ఖాన్

ఆధునిక ఆయుధాలు కలిగి, అపారమైన సైనిక బలగాలున్న బ్రిటిష్ పాలకులను ఎదుర్కోవటం మృత్యువును వాటేసుకోవడమని స్వదేశీ యోధులకు స్పష్టంగా తెలిసినా, తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి పరాయి పాలకులను తరిమి కొట్టేందుకు అలనాడు నడుం కట్టిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నివాసి. ఆయన తండ్రి పఠాన్ రుస్తుం ఖాన్. బ్రిటీష్ సైన్యంలో సైన్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ పరాక్రమాలకు పెట్టింది పేరైన రొహిల్లా సైనిక పటాలం నాయకుడు. ఆంగ్లేయులకు హితుడుగా మారిన నిజాం నవాబు అభీష్టానికి వ్యతిరేకంగా బ్రిటీష్ పాలకుల నుండి మాతృదేశాన్ని విముక్తి చేయమన్న మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ ఉద్బోధ మేరకు తుర్రేబాజ్ ఖాన్ పోరుబాట ఎంచుకున్నారు. మౌల్వీ అల్లావుద్దీన్ సహకారంతో చరిత్రాత్మక మక్కా మసీదు నుండి బయలుదేరి, బ్రిటీష్ ఆధిపత్యానికి చిహ్నమైన హైదరాబాద్ రెసిడెన్సీ వీరీద సుమారు ఐదు వందల మంది సాహసికులతో 1857 జూలై 17న తుర్రేబాజ్ ఖాన్ సాహసోపేతమైన దాడి చేశారు. ఆ పోరాటంలో పలువురు సహచరులను కోల్పోయి గాయపడిన ఆయన బ్రిటీష్- నిజాం బలగాలకు 1857 జూలై 22న పట్టుబడగా ప్రభుత్వం ద్వీపాంతరవాస శిక్ష విధించి, ఆయన యావదాస్తిని స్వాధీనం చేసుకుంది. ఆంగ్లేయాధికారుల సలహామేరకు విధించిన ఆ శిక్ష అమలు జరిగేలోగా పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ 1859 జనవరి 18న జైలు నుండి తప్పించుకున్నారు. ఆగ్రహించిన ప్రభుత్వం తుర్రేబాజ్ ఖాన్‌ను సజీవంగా గానీ నిర్జీవంగా గానీ పట్టితెచ్చిన వారికి అయిదు వేల రూపాయల నగదు నజరానాను 1859 జనవరి 19న ప్రకటించింది. పాలకులు ప్రకటించిన నజరానాకు ఆశపడిన కుర్బాన్ అలీ అను నమ్మకద్రోహి అందించిన సమాచారంతో మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామం వీరీద 1859 జనవరి 24న నిజాం, బ్రిటిష్ సైన్యాలు విరుచుకు పడ్డాయి. ఆ సైన్యాలను సాహసోపేతంగా ఎదుర్కొంటూ తుర్రేబాజ్ ఖాన్ శత్రువు సైనికుల తుపాకి గుండ్లకు బలయ్యారు. ఆ యోధుని పార్థివ శరీరాన్ని హైదరాబాదు నగరానికి తరలించి అంత్యక్రియలు ఏవీ జరపకుండా బలమైన ఇనుప గొలుసులతో కట్టేసి ప్రస్తుత సుల్తాన్ బజారు పోలీసు స్టేషన్ ఉన్న చోట ఒక గుంజకు బహిరంగంగా వేలాడదీశారు. ప్రజలలో తిరుగుబాటు ఆలోచనలు ఏమాత్రం మళ్ళీ పొడ చూపకుండా వారిలో భయోత్పాతం కల్గించేందుకు ఆంగ్లేయులు ఇటువంటి అత్యంత పాశవిక చర్యలకు పాల్పడ్డారు. చివరకు మాతృభూమి విముక్తి పోరాటం విజయవంతం కావడంతో భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రపుటలలో గౌరవప్రదమైన స్థానం పొందిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ప్రజల హృదయాలలో చిరస్మరణీయులుగా నిలిచారు.



- సయ్యద్ నశీర్ అహమ్మద్ 9440241727

# ఆగస్టు 3 లోపే డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి సహకరించాలి

**జిల్లా కలెక్టర్ హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి అయ్యే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఇప్ప టివరకు జిల్లాలో 76 శాతం డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమ రేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికా రులకు అందే విధంగా చొరవ తీసుకో వాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, కానీ ప్రక్రియ ముందే పూర్తి చేసే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే



చేపట్టడం జరుగుతుందని, మ్యాపింగ్ కాని వారిని గుర్తించాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారులకు సహకరించి ఎన్యుమ రేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈ నెల 18న కెరీర్ గైడెన్స్ ఉచిత శిక్షణ కార్యక్రమం

**జిల్లా కలెక్ట ర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో గల ఎస్ పి ఎం లో ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై ఒక్క రోజు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. 3 సెషన్స్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని, ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి కమర్షియల్ టాక్స్ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ అనురాధ, 4 మంది సభ్యులు హాజరై



విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ అనంతరం తీసుకోవలసిన కోర్సులు, ఎంచుకోవలసిన ఉన్నత విద్య అవకాశాలపై క్షుణ్ణంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# సంఘం బలోపేతానికి కృషి చేస్తా

- **విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** విశ్వకర్మ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్ కుమార్ అన్నారు. విశ్వకర్మ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన విలే కరులతో మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామాలలో నివసిస్తున్న విశ్వకర్మ కుటుంబ సభ్యులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇట్టి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. విశ్వకర్మ సమాజ ఐక్యతను బలోపేతం చేయడం, యువతను సంఘ కార్యకలాపాలలో భాగస్వాములు చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, ఈ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అనంతరం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వెంకటయ్య చారి, సురేష్ చారి, భాస్కరాచారి, రాధాకృష్ణ



చారి, శ్రీమంతుల వేణుగోపాల్, కస్తూరి నిఖిల్, నల్గొండ తిరుపతి, కిషోర్,చిలుకూరి మహేష్, శ్రీనివాస్, వెంకన్న, ఆలయ అర్చకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** ఈనెల 19న ఆదిలాబాద్లో జరగనున్న ఏఐటీయూసీ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవర్ధన్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణే ఏఐటీయూసీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, సామాజిక భద్రత కల్పించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై మహాసభలో విస్తృతంగా చర్చిస్తామని తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించి, పోరాట ప్రణాళికను సిద్ధం చేస్తామని వివరించారు. జిల్లాలోని అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, బీడీ కార్మికులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం

**మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ అన్నారు. పట్టణంలోని రహమత్ నగర్ కాలనీలో గురువారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కాలనీలోని



అంతర్గత డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అలాగే రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలుగా పెరిగిన పొదలను తొలగించి పరిస రాలను శుభ్రం చేశారు. ఈ పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ప్రబలకుండా, వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా డ్రైనేజీల పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపడుతున్నామని చెప్పారు. కాలనీవాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపల్ వాహనాలకే అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు షబ్బీర్, అస్లాం, మున్సిపల్ సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కలెక్టర్ కు విన్నపం

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గతంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచుల ప్రతినిధి బృందం గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం



అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ గత పాలనలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం చేపట్టిన భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చాలా కాలంగా పెండింగ్లో ఉండటంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. పనులు పూర్తి చేసేందుకు చేసిన అప్పులను తీర్చలేక, అప్పు ఇచ్చిన వారి ఒత్తిళ్లతో తీవ్ర మనోవే దనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ పెండింగ్ బిల్లుల అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్య పరిష్కా రానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మహేందర్ జాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ సర్పంచులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# 20 'చలో మంచిర్యాల కలెక్టరేట్' ధర్నాను జయప్రదం చేయాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** భవన నిర్మాణ కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ కార్మికులను దగా చేస్తున్నాయని సీఐటీయూ తాండూర్ మండల కన్వీనింగ్ డి.రాజారాం విమర్శించారు. ఈనెల 20న మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. గురువారం తాండూర్ గ్రామంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల అమలుతో పాటు 1996 భవన నిర్మాణ కార్మికుల చట్టం, సెస్ చట్టాన్ని బలహీనపర్చే చర్యలు చేపడుతోందని ఆరోపించారు. సామాజిక భద్రత కోడ్ పేరుతో వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వెల్ఫేర్ బోర్డును బలహీనపర్చే విధానాలను అమలు చేస్తోందని, కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలను ప్రైవేట్ సంస్థలకు మళ్లిస్తున్నట్లు విమర్శించారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వాలు వ్యవహరి స్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు విజయవంతం



చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొల్లం రాజేశం, భవన నిర్మాణ కార్మికులు వెంకటేశం, శాలిగామ పోశం, పూదరి స్వామి, రేవెల్లి ఉమాశంకర్, ఉప్పుట్ల శంకర్, అభి, రాజు, ఇప్ప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సినేషన్



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంతో పాటు దుబ్బగూడా, భీంజిగూడ గ్రామాల్లో గొర్రెలు, మేకల్లో వచ్చే పీపీఆర్ అంటువ్యాధి నివారణ కోసం గురువారం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ సురేష్, వెటర్నరీ అసిస్టెంట్ ఆర్.సికిందర్, దుబ్బగూడా సర్పంచ్ భీంరావ్ పాల్గొని గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో ప్రాణాంతకంగా మారే పీపీఆర్ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ప్రతి పశుపోషక రైతు తమ పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వ్యాక్సినేషన్ ద్వారా పశువులు అంటువ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందడంతో పాటు రైతులకు కలిగే ఆర్థిక నష్టాలను కూడా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పశుపోషక రైతులు పాల్గొన్నారు.

# కొమ్ముగూడెంలో ఘనంగా పోచమ్మ బోనాల పండుగ

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని అచలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల కొమ్ముగూడెం గ్రామంలో గురువారం పోచమ్మ బోనాల పండుగను మహిళలు, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొత్తగా నిర్మించిన పోచమ్మ ఆలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచే మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుని డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి



చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. తమ మొక్కులు తీర్చుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలందరికీ సుఖశాంతులు, మంచి వర్షాలు, పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. బోనాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి కోలాహలంగా మారాయి. ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం గ్రామ మహిళలు, భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి ఈఈగా రమేష్ బాధ్యతల స్వీకరణ

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రోడ్లు , భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈఈ రమేష్ జిల్లా కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో రోడ్లు , భవనాల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన ప్రాజెక్టులపై కలెక్టర్తో చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తానని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రోడ్లు , భవనాల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వర్షా భావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తాండూర్ ఏఈఓ వెంకటేష్ సూచించారు. గురువారం మాదారం గ్రామ శివారులో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో మినుములు, పెసర, కంది, జొన్న, రాగులు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు దిగుబడిని కాపాడుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చని పేర్కొన్నారు. పంట వైవిధ్యంతో భూసారం కూడా పరిరక్షించబడుతుందని వివరించారు. అదేవిధంగా కిష్టంపేట గ్రామంలో ఏఈఓ రాకేష్ రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల్లో సాంప్రదాయ పంటలకు బదులుగా కంది, పెసర, మినుము, నువ్వులు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంట వైవిధ్యాన్ని పాటించడం ద్వారా వాతావరణ మార్పులతో కలిగే నష్టాలను అధిగమించవచ్చని రైతులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో మాదారం, కిష్టంపేట గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# పోడు వ్యవసాయం కేసులో ఇద్దరి రిమాండ్




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** పోడు వ్యవసాయం చేసిన ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించిన ఘటన బెజ్జూర్ మండలంలో చోటుచేసుకుంది. ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెబ్బెన గ్రామానికి చెందిన మండిగ చిన్నయ్య, మండిగ లక్ష్మణ్ అటవీ భూమిలో అనుమతులు లేకుండా పోడు వ్యవసాయం చేస్తున్నట్లు అటవీ సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే కుంటలమానేపల్లి ఎఫ్ఎస్ఓ జె.సంతోష్ కుమార్, ఎఫ్బీఓ వి.శ్రీవాణి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అటవీ చట్టాలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ భూమిలో పోడు వ్యవసాయం సాగు చేస్తున్నట్లు నిర్ధారించడంతో ఇద్దరిపై అటవీ చట్టాల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం జడ్జి వారికి రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో అక్రమంగా పోడు వ్యవసాయం చేపట్టడం చట్టవిరుద్ధమని, అటవీ సంపదను పరిరక్షించేందుకు ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. అటవీ భూములను ఆక్రమించి సాగు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలంలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు సమన్వయంతో, క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రానున్న కార్యక్రమాల నిర్వహణలో నాయకులు సమిష్టిగా పనిచేసి పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్లో ఏసీబీ పంజా

- లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఇరిగేషన్ శాఖాధికారులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ఏసీబీ అధికారులు మరోమారు తమదైన శైలిలో పంజా విసిరారు. ఆదిలాబాద్లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో జరిగిన ఈ దాడి, జిల్లా అధికార యంత్రాంగంలో కలకలం రేపింది. ఎన్ఓసీ కోసం లంచం డిమాండ్ చేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్గా చిక్కారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సొనాల గ్రామానికి చెందిన చౌహాన్ విక్రమ్ సింగ్ తన వ్యవసాయ క్షేత్రంలో విమల పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటు చేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటుకు సంబంధించి ఇరిగేషన్ శాఖ నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' కోసం ఆయన కార్యాలయానికి వెళ్లారు. అయితే ఈ ఫైల్ క్లియర్ చేయాలంటే తమకు భారీగా లంచం ఇవ్వాల్సిందేనని సంబంధిత అధికారులు డిమాండ్ చేశారు. బాధితుడు ఎంతో ప్రాధేయపడినా అధికారులు వినిపించుకోకుండా, రూ.60వేల లంచంగా డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని విక్రమ్ సింగ్, వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పతకం ప్రకారం రంగంలోకి దిగారు. గురువారం చౌహాన్ విక్రమ్ సింగ్ నుంచి ఆఫీసులో రూ.60వేల నగదు తీసుకుంటుండగా, ఇరిగేషన్ శాఖ ఈఈ రాథోడ్ విఠల్, ఏఈ రమేష్ లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితుల నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు, వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రభుత్వ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే సామాన్యుల నుంచి, క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు ఇలా లంచం డిమాండ్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాసేవ కోసం నియమితులైన అధికారులే స్వయంగా లంచం తీసుకుంటూ పట్టుబడటం, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏసీబీ అధికారుల ఈ మెరుపు దాడితో అవినీతికి పాల్పడే ఇతర అధికారుల్లో ఒక్కసారిగా వణుకు మొదలైంది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు మేలు





- జిల్లా వ్యవసాయ అధికారి బోర్కొటె వెంకటి

**ఉద్యమ కెరటం, కౌటాల:** ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి బోర్కొటె వెంకటి సూచించారు. గురువారం కౌటాల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువుల డీలర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కంది, జొన్న, సజ్జ, రాగి, కొర్రలు, నువ్వులు, ఆముదం వంటి ఆరుతడి, మెట్ట పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాభావం కారణంగా చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండలేదని, అలాంటి పరిస్థితుల్లో వరి సాగు చేపట్టి ఇబ్బందులు ఎదుర్కోవద్దని సూచించారు. వరి పొలాల్లో అధిక సాంద్రత విధానం ద్వారా పత్తి సాగు చేపట్టవచ్చని, అలాగే ఈ నెలాఖరు వరకు కంది విత్తనాలను విత్తుకోవచ్చని అన్నారు. పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా 200 లీటర్ల నీటిలో 4 కిలోల యూరియా కలిపి ఆకులపై పిచికారీ చేయాలని, అలాగే 19:19:19 నీటిలో కరిగే ఎరువును కూడా పిచికారీ చేయడం ద్వారా పంట ఎదుగుదల మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు సీహెచ్ అంజన్న, జి.ఘన్శ్యామ్, రాజేశ్వర్, ఎస్.సాగర్, ఎస్.కల్పన, ఆర్.రేష్మిత, జి.కవిత, ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తా

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్
- సిర్పూర్లో తొలిసారిగా మున్నూరు కాపు మహిళా కమిటీ ఏర్పాటు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో తొలిసారిగా మున్నూరు కాపు సంఘం మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. కాగజ్నగర్ పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో తాలూకా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఎమ్మాజీ శారద, కార్యదర్శిగా కర్ల లావణ్య చిరంజీవి, ఉపాధ్యక్షురాలిగా పెద్దపల్లి అనిత శ్రీనివాస్, మండల అధ్యక్షురాలిగా గజ్జి కవిత కోటేష్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులను తాలూకా అధ్యక్షుడు, కార్యదర్శి, సంఘ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ నూతన కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో తొలిసారిగా మున్నూరుకాపు సంఘం మహిళా కమిటీ ఏర్పడటం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. మహిళలు సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మున్నూరు కాపు సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సంఘం నియోజకవర్గంలో బలమైన సామాజిక శక్తిగా ఎదుగుతోందని అన్నారు. సంఘ అభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం తాలూకా అధ్యక్షుడు సుంకరి తిరుపతి, కార్యదర్శి గోలెం వెంకటేశం, తాటి రామచందర్, పోతురాజుల లక్ష్మణ్, కలికోట రమణయ్య, ఏస సత్యనారాయణ, ఎమ్మాజీ సంతోష్, బర్ల కిరణ్ కుమార్, కర్ల చిరంజీవి, నాగేశ్వరరావు, బల్గారుపు రాజన్న, సిద్ధం శ్రీనివాస్, జవాజి సంతోష్, గజ్జి మహేష్, ఎమ్మాజీ మహేష్, ఒడ్నాల సురేందర్, పూదరి మధుకర్, గద్దల తిరుపతి, మేడిపల్లి రవి, గోవిందుల రాజన్న, సత్యంశెట్టి శ్రీనివాస్, పర్వతి సాయికుమార్, మహిళా సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి క్షేత్రస్థాయిలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో కమిషన్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు అధికారులు కమిషన్ చైర్మన్, సభ్యులకు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. సమావేశంలో జిల్లాలో అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు, అట్రాసిటీ కేసుల దర్యాప్తు, భూ సమస్యలు, రిజర్వేషన్ల అమలు, సబ్ప్లాన్ నిధుల వినియోగం తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అట్రాసిటీ కేసుల నమోదు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధిహామీ పథకం అమలుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లోని ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులు, రోస్టర్ విధానాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా అమలు చేయాలని, ప్రతినెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే సమావేశాలను నిర్వహించి ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సంబంధించిన నిధులు ఎక్కడైనా పెండింగ్లో ఉంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విడుదలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. కామన్ మెనూ అమలు, ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రయోజనాలు అందిస్తున్నామని, అట్రాసిటీ కేసుల దర్యాప్తు కూడా వేగంగా కొనసాగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుస్త్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఎ పీఓ మంద మకరందు, ఏఎస్పీ సాయి రుత్విక్ కొట్టే, అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రా, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీఓలు జగదీశ్వర్ రావు, మోహన్ సింగ్, డీఎస్పీ జీవన్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# సాగునీటి అవసరాల దృష్ట్యా పనులు వేగవంతం చేయాలి

- సీతారామ ప్రాజెక్ట్ టన్నెల్ పనులను పరిశీలించిన మంత్రులు
- యాతాలకుంటలో సమీక్ష సమావేశం



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి :** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాల కుంట వద్ద నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ టన్నెల్ పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. వారితో పాటు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిని ఇరిగేషన్ శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. పనుల నాణ్యత, నిర్మాణ వేగం, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రులు, రైతులకు సాగునీరు అందించే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం యాతాల కుంటలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, ఎదుర వుతున్న సాంకేతిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమగ్రంగా చర్చించారు. రైతులకు త్వరితగతిన సాగునీటి ప్రయోజనాలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ కార్ ర్యాలీగా యాతాలకుంటకు చేరుకుని మంత్రులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కలెక్టర్, కల్లూరు సబ్ కలెక్టర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సత్తుపల్లి, కల్లూ రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు , కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గడువులోగా ఫారాలు నింపాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలను గడువులోగా నింపాలని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దుర్గానగర్, శంకర్ గుట్ట కాలనీల్లో కొన సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వారీగా జరుగుతున్న ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో గడువులోగా ఫారాలు సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంలో బీఎల్ఓలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ప్రతి అర్హుడితో ఫారాలు నింపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలంటే ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని అన్నారు. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేర్లు సరిచూసుకుని అవసరమైన సవరణలు గడువులోపు పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగన్న, కాలనీ వాసులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొ న్నారు.

# వాన దేవా.. కరుణించవా..

- ఆకాశం వైపు అన్నదాత దీనచూపు!
- అప్పులు చేసి విత్త నాలు చల్లి న రైతులు
- వర్షా భావంతో ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు
- వరుణుడి కోసం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** "వాన దేవుడా.. ఒక్క చినుకు రాల్చవా.. చినుకమ్మా.. కరుణించి ఒక్కసారి రావమ్మా.." ఇది ఆదిలాబాద్ జిల్లాలోని పల్లె ల్లోప్రతి రైతన్న నోట వినిపిస్తున్న ఆర్తనాదం. చేతికి అందుతుందని ఆశపడ్డ పంటలు కళ్లముందే ఎండిపోతుంటే, ఆకాశం వైపు వేయి కళ్లతో ఎదురుచూస్తున్న అన్నదాతల కన్నీరు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఆశగా మొదలెట్టి.. ఆవేదనగా మిగిలి.. వానకాలం ఆరంభంలో రుతుపవనాల రాకతో అక్కడక్కడ కురిసిన చినుకులను నమ్మి రైతన్నలు భారీ ఆశలతో సాగు మొదలుపెట్టారు. అప్పులు చేసి మరీ వరి, పత్తి, మొక్కజొన్న విత్తనాలను భూమిలో నాటారు. దుక్కిదున్ని, ఎన్నో ఆశలతో విత్తనాలు వేస్తే, వరుణుడు మాత్రం ముఖం చాటేశాడు. విత్తనాలు మొలకెత్తకముందే ఎండిపోతుండటం, మొలకెత్తిన మొక్కలు భానుడి ప్రతాపానికి వాడిపోతుండటంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

**కళావిహీనంగా మారిన పంట పొలాలు..**

సాధారణంగా ఈ సమయానికి పంట పొలాలు పచ్చదనంతో కళకళ లాడాలి. కానీ, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆదిలాబాద్ జిల్లాలోని అనేక గ్రామాల్లో పంట పొలాలు బోసిపోతున్నాయి. వానకాలం మొదలై రెండు నెలలు గడుస్తున్నా, సరిపడా వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

**ఎండిపోతున్న వరినాట్లు ..**

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండటంతో వరి, మొక్కజొన్న పంటలు ఎండుముఖం పడుతున్నాయి. నీటి సౌకర్యం లేక నాట్లు వాడిపోతుండగా, తేమ కొరతతో మొక్కజొన్న పంట కూడా ఎండవేడికి మాడిపోతోంది. ఇప్పటికే సాగు కోసం అప్పులు చేసిన రైతులు పంటలు దెబ్బతినడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ విత్తనాలు వేయాల్సి వస్తే అదనపు పెట్టుబడి ఎలా భరించాలనే ఆందోళన వారిని వెంటాడుతోంది.

**వరుణుడి కరుణ కోసం గ్రామ దేవతలకు మొక్కులు..**

శాస్త్రీయ దృక్పథం పక్కన పెడితే, నమ్మకాలకు ప్రాధాన్య తనిస్తూ గ్రామీణ ప్రాంత రైతులు తమ ఆవేదనను దేవుడి ముందు ఉంచుతున్నారు. "వాన దేవుడా కరుణించవా" అంటూ పాటలు పాడుతూ, గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేస్తున్నారు. వర్షాల కోసం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రకృతిని శాంతింపజేయడానికి తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. "పంటలు పండక పోతే అప్పుల ఊబిలో కూరుకుపోతాం, దేవుడే దిక్కు" అని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి..**

ప్రకృతి వైపరీత్యంతో రైతులు పడుతున్న ఈ ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే గుర్తించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సర్వే జరిపి, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు విన్నవిస్తున్నారు.

**చినుకు కోసం ఎదురుచూపులు..**

ఆకాశం నిర్మలంగా కనిపిస్తున్నా.. రైతన్న చూపు మాత్రం మేఘాల కోసం వెతుకుతూనే ఉంది. ఎప్పుడు మేఘాలు కమ్ముకుంటాయో, ఎప్పుడు మంచి వర్షం కురుస్తుందోనని జిల్లా రైతాంగం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోంది. అప్పులు చేసి సాగు ప్రారంభించిన పంటలు వర్షం లేక ఎండుముఖం పడుతుండటంతో రైతుల ఆందోళన రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం కురిసే మంచి వర్షమే పంటలను గట్టెక్కిస్తుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. గ్రామాల్లో వరుణుడి కరుణ కోసం ప్రత్యేక పూజలు, మొక్కులు కొనసాగుతుండగా, "చినుకమ్మా.. త్వరగా రా.. మా పంటలను కాపాడు" అంటూ అన్నదాతలు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. ప్రకృతి కరుణించి సకాలంలో వర్షాలు కురిస్తేనే తమ కష్టం ఫలిస్తుందని, లేకపోతే తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "వరుణుడా.. కరుణించి చినుకుల వరం కురిపించు" అంటూ జిల్లా రైతాంగం యావత్తూ వేడుకుంటోంది.



# చైతన్య విద్యానికేతన్ లో ఉపాధ్యాయులకు నైపుణ్య వికాస శిక్షణ

**ఆధునిక బోధనా విధానాలపై అవగాహన కల్పించిన నిపుణులు**



**ఉద్యమ కెరటం,భిక్కనూర్:**
భిక్కనూర్‌లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపు లక్ష్యంగా టీచర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. మహీంద్రా యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచర్ ట్రైనర్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ రిసోర్స్ పర్సన్ డా. రవికుమార్ ముఖ్య వక్తగా పాల్గొ ని ఆధునిక బోధనా విధానాలపై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థి కేంద్రిత అభ్యాసం, తరగతి గది నిర్వహణ, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతికత ఆధారిత బోధన, విద్యార్థుల్లో అభ్యాస ఆసక్తిని పెంపొందించే వినూత్న పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు.పాఠశాల కరస్పాండెంట్ భూర్ల రేణుకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ యాదవ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్ .. డీజే చోరీ కేసు ఛేదన

**జిల్లా లో రెండు వేర్వేరు కేసుల్లో పోలీసుల చర్యలు..**





**ఉద్యమ కెరటం,కామారెడ్డి:**
జిల్లాలో రెండు వేర్వేరు కేసుల్లో పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. గాంధారి పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేయగా, బీబీపేట్ పోలీసులు డీజే సౌండ్ సామగ్రి, టాటా ఏస్ వాహనం చోరీ కేసును ఛేదించి ముగ్గు రు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.గాంధారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ డంప్ యార్డ్ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ మహేందర్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,160 నగదు, 6 మొబైల్ ఫోన్లు ,7 మోటార్‌సై కిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మరోవైపు తుజాల్పూర్ గ్రామంలో జరిగిన డీజే సౌండ్ సామగ్రి, టాటా ఏస్ మినీ గూడ్స్ క్యారియర్ చోరీ కేసును బీబీపేట్ పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఫుటేజ్, సాంకేతిక ఆధారాల ఆధారంగా సిరిగాడ బ్రిడ్జి వద్ద తనిఖీల సమయంలో ముగ్గురు నిందితులను పట్టుకుని, చోరీకి గురైన టాటా ఏస్ వాహనంతో పాటు డీజే సౌండ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు ఇతర ప్రాంతాల్లో కూడా డీజే సామగ్రి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితుల్లో ఒకరు మేజర్ కాగా, ఇద్దరు బాల నేరస్థులను జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే డీజే చోరీ కేసును వేగంగా ఛేదించి ఆస్తిని స్వాధీనం చేసుకున్న బీబీపేట్ ఎస్‌హెచ్ఓ కొండా విజయ్, బిక్కనూర్ సీఐ నరేష్‌తో పాటు దర్యాప్తు బృందాన్ని అభినందించారు.

# మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలి

- తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి బోధించాలి
- జిల్లా అదనపు కలెక్ట ర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వినూత్న బోధన విధానాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇతర భాషల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు బోధన సవాలుగా మారిందని, దానిని అధిగమించేందుకు సృజనాత్మక బోధన పద్ధతులను అవలంభించాలని అన్నారు. కథలు, కవితలు, పద్యాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియల ద్వారా విద్యార్థుల భాషా నైపుణ్యాలను పెంపొందించవచ్చని, శిక్షణలో పొందిన అనుభవాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కోఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్రం ఇన్చార్జి బోనగిరి శ్రీనివాస్, జిల్లా స్థాయి డీఆర్పీలు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

# ఆశ్రమ పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థి క్షేమం

- నాలుగు గంటల్లో నే గుర్తి ంచిన భిక్కనూరు పోలీసులు.. తల్లి దండ్రులకు అప్పగింత...

**ఉద్యమ కెరటం, భిక్కనూరు:**
కామారెడ్డి జిల్లా భిక్కనూరు సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి ఐదో తరగతి విద్యార్థి తప్పించుకోవడం బుధవారం కలకలం రేపింది. పోలీసులు వేగంగా స్పందించి నాలుగు గంటల వ్యవధిలోనే బాలుడిని సురక్షితంగా గుర్తించి తల్లి దండ్రులకు అప్పగించారు.మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన కే. రుత్విక్ ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఉదయం ప్రార్థన అనంతరం మూత్ర విసర్జనకు వెళ్తున్నట్లు చెప్పి బయటకు వెళ్లిన బాలుడు, ప్రహరీ గోడ దూకి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విషయం ఆలస్యంగా గుర్తించిన పాఠశాల సిబ్బంది భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సీఐ జగడం నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు, క్రైమ్ పార్టీ పోలీసులు రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర గ్రామాల్లో గాలింపు చేపట్టారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బాలుడి స్వగ్రామంలోని పాఠశాలకు వెళ్లగా, అక్కడ ఐదో తరగతి గదిలో ప్రశాంతంగా పాఠాలు వింటూ కనిపించాడు. వెంటనే బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా, ఆశ్రమ పాఠశాలలో ఉండి చదవడం ఇష్టం లేక స్వగ్రామ పాఠశాలకు వెళ్లినట్లు తెలిపాడు.బాలుడిని అనంతరం తల్లిదండ్రులకు అప్పగించగా, మిస్సింగ్ ఘటనకు సుఖాంతం లభించింది.

# టీమిండియా యువ పేసర్‌కు బిగ్‌షాక్



## భారీ జరిమానా విధించిన ఐసీసీ

**బర్మింగ్‌హామ్, జూలై 16 (ఉద్యమ కెరటం):** టీమ్‌ఇండియా యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ జరిమానాకు గురయ్యాడు. బర్మింగ్‌హామ్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో గుర్నూర్ బ్రార్ ప్రమాదకర రీతిలో బౌలింగ్ చేశాడనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), అతడి ప్రవర్తన సరిగ్గా లేదని నిర్ధారించింది. ఐసీసీ నిబంధనావళిలోని లెవెల్-1 నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ గుర్నూర్ మ్యాచ్ ఫీజులో కొంత శాతాన్ని జరిమానాగా విధించడంతో పాటు, అతడి ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. మ్యాచ్ ఆఖరి ఓవర్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొన్న సమయంలో గుర్నూర్ బ్రార్ వేసిన ఒక డెలివరీ ఇంగ్లాండ్ బ్యాటర్‌కు ప్రమాదకరంగా దూసుకెళ్లింది. బ్యాటర్ రక్షణను ప్రమాదంలో పడేసేలా, క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ఆ బంతిని సంధించినట్లు ఫీల్డ్ అంపైర్లు గుర్తించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత అంపైర్లు ఈ విషయాన్ని మ్యాచ్ రెఫరీ దృష్టికి తీసుకెళ్లారు. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9 ప్రకారం.. వికెట్ల మధ్య పరిగెడుతున్న లేదా క్రీజులో ఉన్న ఆటగాళ్లపైకి ప్రమాదకరంగా బంతిని విసరడం లేదా దూకుడుగా ప్రవర్తించడం నేరం కిందకు వస్తుంది. గుర్నూర్ తన తప్పును అంగీకరించడంతో ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేకుండానే మ్యాచ్ రెఫరీ ఈ శిక్షను ఖరారు చేశారు. ఒక ఏడాది కాలంలో ఆటగాళ్లకు వచ్చే డీమెరిట్ పాయింట్లు వారి భవిష్యత్తు మ్యాచ్‌లపై ప్రభావం చూపుతాయి. 24 నెలల వ్యవధిలో ఒక ఆటగాడు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు సాధిస్తే, వారు నిషేధాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. గుర్నూర్ బ్రార్ లాంటి యువ ఆటగాళ్లకు ఇటువంటి క్రమశిక్షణా చర్యలు కెరీర్ ఆరంభంలోనే ఒక హెచ్చరికగా మారుతాయి. మైదానంలో దూకుడు ప్రదర్శించడం మంచిదే అయినప్పటికీ, అది ఐసీసీ నిర్దేశించిన హద్దులను దాటకూడదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత జట్టు మేనేజ్‌మెంట్ కూడా భవిష్యత్తు మ్యాచ్‌లలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భావోద్వేగాలను నియంత్రించుకుంటూ బౌలింగ్ చేయాలని గుర్నూర్‌కు సూచించింది. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న టీమ్‌ఇండియాకు ఈ పరిణామం కాస్త ఇబ్బందికరంగా మారినప్పటికీ, తదుపరి మ్యాచ్‌ల్లో గుర్నూర్ బ్రార్ పుంజుకుంటాడని అభిమానులు ఆశిస్తున్నారు.




# రోహిత్ శర్మపై వేటు

### జట్టులోకి యువరాజ్ సింగ్, సచిన్

**ఢిల్లీ, జూలై 16 (ఉద్యమ కెరటం):** మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ రాబిన్ ఉతప్ప ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'దిస్ ఆర్ దట్' ఛాలెంజ్ ద్వారా తన భారత వన్డే ఎలెవెన్ జట్టును ప్రకటించారు. ఈ జట్టులో రోహిత్ శర్మ, హర్భజన్ సింగ్ వంటి దిగ్గజాలకు చోటు దక్కకపోవడం గమనార్హం. రోహిత్ శర్మ, సునీల్ గవాస్కర్‌లను పక్కనపెట్టి సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీలను ఓపెనర్లుగా ఉతప్ప ఎంచుకున్నారు. మిడిలార్డర్‌లో 2011 ప్రపంచకప్ విజేత జట్టు సభ్యులైన విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, ఎమ్మెస్ ధోని, సురేష్ రైనాలకు అవకాశం ఇచ్చారు. రాహుల్ ద్రవిడ్, మహ్మద్ అజారుద్దీన్, అజయ్ జడేజాల కంటే వీరికే ప్రాధాన్యతనిచ్చారు. ఈ ఛాలెంజ్‌లో ధోనిని మరెవరితోనూ పోల్చకుండా నేరుగా ఎంపిక చేయడం విశేషం. భారత 1983 ప్రపంచకప్ కెప్టెన్ కపిల్ దేవ్, రవీంద్ర జడేజాలను ఆల్‌రౌండర్లుగా ఎంపిక చేశారు. హార్దిక్ పాండ్యా, రవిచంద్రన్ అశ్విన్‌లకు ఇందులో చోటు దక్కలేదు. ఇక స్పిన్ విభాగంలో వన్డేల్లో భారతదేశం తరఫున అత్యధిక వికెట్లు (334) తీసిన అనిల్ కుంబ్లేకు మొగ్గు చూపారు. హర్భజన్ సింగ్‌ను (265 వికెట్లు) పక్కన పెట్టారు. ఫాస్ట్ బౌలర్లుగా జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రాలను ఎంచుకున్నారు. ఈ జట్టులో ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లు ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారు విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా. వన్డేల్లో 54 శతకాలతో అత్యధిక సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడిగా ఉన్న విరాట్ కోహ్లీ (14,802 పరుగులు), సచిన్ టెండూల్కర్ (18,426 పరుగులు) తర్వాత భారత్ తరఫున రెండో అత్యధిక రన్-స్కోరర్‌గా ఉన్నారు.

### రాబిన్ ఉతప్ప వన్డే జట్టు

సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, ఎమ్మెస్ ధోని (కెప్టెన్), సురేష్ రైనా, కపిల్ దేవ్, రవీంద్ర జడేజా, అనిల్ కుంబ్లే, జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రా.

# 2027 ప్రపంచకప్‌కు కొత్త ఫార్మాట్

## భారత్-పాక్‌కు మూడుసార్లు తలపడే అవకాశం



**దుబాయ్, జూలై 16 (ఉద్యమ కెరటం):** అంతర్జాతీయ క్రికెట్ మండలి 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ ఫార్మాట్‌లో కీలక మార్పులకు ఆమోదం తెలిపింది. కొత్త విధానంతో టోర్నీ మరింత ఉత్కంఠభరితంగా సాగడంతో పాటు, చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే ప్రపంచకప్‌లో గరిష్ఠంగా మూడుసార్లు తలపడే అవకాశాన్ని కల్పించింది. ఈ మార్పులు పోటీతత్వాన్ని పెంచడమే కాకుండా వాణిజ్యపరంగానూ టోర్నీకి మరింత ఆకర్షణ తీసుకురానున్నాయని ఐసీసీ భావిస్తోంది. 2027 ప్రపంచకప్‌కు మొత్తం 14 జట్లు అర్హత సాధించినప్పటికీ, ప్రధాన టోర్నీని 12 జట్లతో నిర్వహించనున్నారు. దిగువ స్థానాల్లో నిలిచిన మూడు జట్ల మధ్య ముందుగా ప్రిలిమినరీ దశ నిర్వహించి, అందులో విజేతగా నిలిచిన జట్టుకు ప్రధాన టోర్నీలో చోటు కల్పిస్తారు. అనంతరం 12 జట్లను ఆరు చొప్పున రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. లీగ్ దశ అనంతరం ఇప్పటి వరకు అమల్లో ఉన్న 'సూపర్ సిక్స్' విధానానికి బదులుగా 'సూపర్ సెవెన్' దశను ప్రవేశపెట్టారు. రెండు గ్రూపుల నుంచి అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఏడు జట్లు ఈ దశకు అర్హత సాధిస్తాయి. ఇక్కడ జట్లు పరస్పరం రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. ఈ దశ ముగిసిన తర్వాత క్వార్టర్ ఫైనల్స్ లేకుండానే నేరుగా సెమీ ఫైనల్స్, అనంతరం ఫైనల్ నిర్వహించనున్నారు. కొత్త ఫార్మాట్‌తో భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే టోర్నీలో మూడు సార్లు తలపడే అవకాశాలు పెరిగాయి. గ్రూప్ దశలో ఒకసారి, సూపర్ సెవెన్‌లో మరోసారి, అనంతరం సెమీ ఫైనల్ లేదా ఫైనల్‌లో మరోసారి ఈ రెండు జట్లు ఎదురుపడే అవకాశం ఉంటుంది. ద్వైపాక్షిక సిరీస్‌లు నిలిచిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో ఐసీసీ టోర్నీల్లోనే ఈ రెండు దేశాలు తలపడుతున్న నేపథ్యంలో ఈ మార్పు అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్--పాకిస్థాన్ మ్యాచ్‌లకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణ దృష్ట్యా ప్రసార హక్కులు, ప్రకటనల ఆదాయం కూడా గణనీయంగా పెరిగే అవకాశముందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమావేశంలో 2028 టీ20 ప్రపంచకప్ ఫార్మాట్‌లోనూ ఐసీసీ మార్పులకు ఆమోదం తెలిపింది. ఈ టోర్నీ 20 జట్లతోనే కొనసాగనున్నప్పటికీ, గ్రూప్ దశ అనంతరం ఎనిమిది జట్లకు బదులుగా పది జట్లు 'సూపర్ 10' దశకు అర్హత సాధిస్తాయి. అక్కడ అత్యుత్తమ ప్రదర్శన చేసిన రెండు జట్లు నేరుగా సెమీ ఫైనల్స్‌కు చేరుకోగా, మిగిలిన రెండు సెమీ ఫైనల్ బెర్తుల కోసం కొత్తగా 'ఎలిమినేటర్' దశను నిర్వహించనున్నారు. ఈ మార్పులతో రెండు ప్రపంచకప్‌లూ మరింత పోటీతత్వంతో సాగనున్నాయని ఐసీసీ పేర్కొంది.

# కోహ్లీ విజయానికి ఆత్మవిశ్వాసమే బలమన్న అభిషేక్ నాయర్

**ముంబై, జూలై 16 (ఉద్యమ కెరటం):** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ విజయాల వెనుక ఉన్న ప్రధాన రహస్యం తన ఆటతీరుపై అతడికి ఉన్న అచంచలమైన నమ్మకమేనని భారత మాజీ సహాయక కోచ్ అభిషేక్ నాయర్ వెల్లడించాడు. కఠిన పరిస్థితుల్లో కూడా తన పద్ధతులను మార్చకుండా ముందుకు సాగే కోహ్లీ మానసిక ధైర్యమే అతడిని ప్రపంచంలోని అత్యుత్తమ క్రికెటర్లలో ఒకరిగా నిలబెట్టిందని ప్రశంసించాడు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా కోహ్లీతో జరిగిన ఆసక్తికర సంభాషణను నాయర్ గుర్తు చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో అతడిపై విమర్శలు వెల్లువెత్తిన సమయంలో కూడా కోహ్లీ ఏమాత్రం ఆందోళన చెందలేదని నాయర్ తెలిపాడు. ఆ సమయంలో తాను కోహ్లీకి ఫోన్ చేసి పరిస్థితి గురించి మాట్లాడగా, "అంతా బాగానే ఉంది. ఇదంతా ఆటలో భాగమే" అని ఎంతో ప్రశాంతంగా సమాధానం ఇచ్చాడని వెల్లడించాడు. ఆ సమాధానం కోహ్లీ మానసిక స్థైర్యానికి నిదర్శనమని పేర్కొన్నాడు. తాను గమనించిన ఒక సాంకేతిక అంశంపై సూచన ఇవ్వాలని కోహ్లీని అడిగినప్పుడు, "నేను నా పద్ధతిలోనే కొనసాగుతాను" అని సున్నితంగా తిరస్కరించాడని నాయర్ చెప్పాడు. ఆ తర్వాత జరిగిన మ్యాచ్ అనంతరం కూడా కోహ్లీ తన ఆటతీరుపై నమ్మకం ఉంచి విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, తన నిర్ణయంపై కోహ్లీకి ఉన్న విశ్వాసం తనను ఎంతో ఆకట్టుకుందని వివరించాడు. ఈ ఒక్క సంఘటన గొప్ప ఆటగాళ్ల మానసిక బలాన్ని స్పష్టంగా చూపిస్తుందని నాయర్ అభిప్రాయపడ్డాడు. క్లిష్ట పరిస్థితుల్లో ఎలా స్పందించాలో, ఎలా తిరిగి ఫామ్‌లోకి రావాలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి ఆటగాళ్లకు బాగా తెలుసని అన్నాడు. విశ్లేషకులు ఎన్నో సూచనలు చేసినా, అంతర్జాతీయ స్థాయిలో నిరంతరం విజయాలు సాధించేది ఆటగాళ్ల ఆత్మవిశ్వాసమేనని పేర్కొన్నాడు. అందుకే కోహ్లీ, రోహిత్‌లాంటి క్రికెటర్లపై తనకు అపారమైన గౌరవం ఉందని, తమపై తాము పెట్టుకున్న నమ్మకమే వారిని ఇతరుల కంటే ప్రత్యేకంగా నిలబెట్టిందని అభిషేక్ నాయర్ వెల్లడించాడు.



# అర్జెంటీనా ఆటగాళ్ల బ్యానర్‌పై వివాదం

**అట్లాంటా, జూలై 16 (ఉద్యమ కెరటం):** ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇంగ్లండ్‌పై సెమీఫైనల్ విజయం అనంతరం అర్జెంటీనా ఆటగాళ్లు ప్రదర్శించిన బ్యానర్ వివాదానికి దారి తీసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో సంబరాలు జరుపుకున్న ఆటగాళ్లు ఫాక్‌ల్యాండ్స్ దీవులకు సంబంధించిన సందేశంతో కూడిన బ్యానర్‌ను ప్రదర్శించారు. అందులో 'లాస్ మాల్వినాస్ అర్జెంటీనావే' అనే భావం వ్యక్తమయ్యే నినాదం ఉండటంతో రాజకీయ వివాదం చెలరేగింది. ఫాక్‌ల్యాండ్స్ దీవులపై బ్రిటన్, అర్జెంటీనా మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతోంది. అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న ఈ దీవులు ప్రస్తుతం బ్రిటన్ ఆధీనంలో ఉన్నప్పటికీ, అవి తమ భూభాగమేనని అర్జెంటీనా వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లు ప్రదర్శించిన బ్యానర్ క్రీడా వేదికపై రాజకీయ సంకేతాలను ప్రోత్సహించినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదానికి చారిత్రక నేపథ్యం కూడా ఉంది. 1982లో ఫాక్‌ల్యాండ్స్ దీవుల అంశంపై బ్రిటన్, అర్జెంటీనా మధ్య యుద్ధం జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో 2014లో కూడా అర్జెంటీనా ఆటగాళ్లు ఇలాంటి వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించగా, అప్పట్లో జట్టుపై భారీ జరిమానా విధించారు. తాజా ఘటనపై ఫిఫా అధికారులు దర్యాప్తు ప్రారంభించనున్నట్లు సమాచారం. పోటీ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ సందేశాలను ప్రదర్శించారనే ఆరోపణలపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకునే అవకాశముందని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.



ఉద్యమ కెరటం UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక


# ప్రేక్షకుల ప్రేమే నా బలం: కిరణ్ అబ్బవరం



**హైదరాబాద్, జూలై 1 6 (ఉద్యమ కెరటం):** గత ఐదారు సంవత్సరాలుగా ప్రేక్షకుల నుంచి అపారమైన ప్రేమాభిమానాలు అందుకున్నానని, మంచి చిత్రాలతో వారి ఆదరణను మరింతగా పొందేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న లిచెన్నై ప్రేమకథ' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ చిత్రంలో స్వచ్ఛమైన ప్రేమకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఒక యువతి కోసం ఎంత గొప్పగా ప్రేమించవచ్చో ఈ కథలో చూపించామని, ప్రేమతో పాటు ప్రేక్షకులను అలరించే మాస్ అంశాలు కూడా చిత్రంలో ఉన్నాయని తెలిపారు. ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. నిర్మాత ఎస్.కే.ఎన్. మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను తాకే ప్రేమకథగా నిలుస్తుందని చెప్పారు. దర్శకుడు రవి నంబూరి మాట్లాడుతూ, ప్రధాన పాత్రల భావోద్వేగాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయని తెలిపారు. ఈ చిత్రంలో శ్రీగౌరి ప్రియ కథానాయికగా నటించగా, సంగీతాన్ని మణిశర్మ సమకూర్చారు.

# ‘ఆపరేషన్ అరుణారెడ్డి'పై పోసాని ధీమా




**హైదరాబాద్, జూలై 16 (ఉద్యమ కెరటం):** పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణం, దర్శకత్వంలో తెరకెక్కించిన ‘ఆపరేషన్ అరుణారెడ్డి' చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విడుదలకు ముందరి కార్యక్రమంలో పోసాని మాట్లాడుతూ ఈ చిత్రం తన సినీ జీవితంలో అత్యుత్తమ కథనంతో రూపొందిన చిత్రమని అన్నారు. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు కథ ఏ మలుపు తిరుగుతుందో ప్రేక్షకులు ఊహించలేరని, ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా సాగుతుందని తెలిపారు. కుటుంబ సమేతంగా చూసే విధంగా ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా చిత్రాన్ని తెరకెక్కించామని చెప్పారు. ఈ చిత్రంలో హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, అయేషా ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషించగా, మహదేవ్ ఏలెందర్ సంగీతం సమకూర్చారు.

# నా ఫోటోలు తీయకండి ప్లీజ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై ఆసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. ‘నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా‘ అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.







# రజనీకాంత్ చిత్రంలో రుక్మిణికి చాన్స్



**చెన్నై, జూలై 16 (ఉద్యమ కెరటం):** కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు వం– ుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు దక్కుతున్నాయి. ఇప్పటికే యశ్ నటిస్తున్న ‘టాక్సిక్', ఎన్టీఆర్ నటిస్తున్న లి‘డ్రాగన్' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న ఆమెకు తాజాగా రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందనున్న ‘ధర్మన్ – ది డెడ్లీ డాక్టర్' చిత్రంలోనూ కీలక పాత్ర లభించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యంతో సాగుతుందని సమాచారం. సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలను ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేపట్టగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ సమకూరుస్తున్నారు. వరుసగా ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంటున్న రుక్మిణి వసంత్ ప్రస్తుతం దక్షిణ భారత చిత్రసీమలో అత్యంత బిజీ కథానాయికలలో ఒకరిగా నిలుస్తున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**